కథానిక

# దొంగలు పడిన రాత్రి

అంగర సూర్యారావు

అర్ధరాత్రి ప్రశాంతతని బరువైన అడుగుల చప్పుడు, కుక్కల అరుపులు భగ్నపరిచినై. మనుషుల కేకలు వినిపిస్తున్నై. ఏదో ఉపద్రవం జరిగిందని వీధిఅరుగుమీద కూర్చుని చూస్తున్నాను. వస్తాదుప్రకాష్ కర్ర భుజాన్ని పెట్టుకుని,దూకుడుగా వచ్చాడు. వస్తాదుప్రకాష్ పంజాబీ వాడూకాడు గుజరాతీ వాడూకాడు. స్వచ్ఛమైన తెలుగువాడు. అసలుపేరు ప్రకాశరావు. మల్లవిద్యలో ప్రవీణుడు దేహసౌష్ఠవ పోటీలో ఓడిపోయినవాడు. యితని బలాన్ని గురించి చిన్న ఉదహారణ చెప్పడం అవసరం. చెయ్యెత్తు పొడవు, యిద్దరు మనుషుల బరువు వుండే ఒక కాబూలీవాడు ఒకసారి యితనిని నడివీధిలో నిలబెట్టాడు. ప్రకాశరావు వాడికి నయాన్ని ఎంతో చెప్పాడు. కాబూలీవాడు వడ్డీ ఇస్తేకాని కదలనివ్వనన్నాడు. చివరకు విధిలేక ప్రకాశరావు వాణ్ణి బ్రతిమాలాడు. అయినావాడు వినలేదు. చేసేదిలేక చెయ్యెత్తి చెళ్ళున ఒక లెంపకాయ కొట్టాడు ప్రకాశరావు. ఆ దెబ్బకు అంత బలమైన కాబూలీవాడు వడ్డీకాదుకదా కనీసం మంచినీళ్ళయినా అడక్కుండా పడిపోయాడు.- అలాంటి ప్రకాశరావు కర్ర భుజాన్ని వేసుకు రావడంతో నాకు కంగారు కలిగింది.

'ఏరోయ్! ప్రకాశరావు ఏమిటి? ఏంజరిగింది?' అన్నాను.

"దొంగలు! దొంగ్రలా! ఒకొక్కణ్ణి బుర్రచితక కొడుదును దొరకలేదుకాని!" అన్నాడు ప్రకాశరావు ఆవేశంతో.

"ఎవరింట్లో పడ్డారు దొంగలు?" అన్నాను.

"ఇళ్ళలోపడితే బాగానే వుండును. యిళ్ళలో పడలేదు. జగన్నాథస్వామి కోవెలలోపడి దేవుడి ఆభరణాలు, సొమ్ములంతా ఎత్తుకుపోయారు."

ఈ సమయంలో రాజగోపాల్ తొందరగా వచ్చాడు. యితను రాజకీయాల్లో అతివాది. సాంఘిక విషయాలలో మితవాది. వస్తూనే ఉపన్యాసం ప్రారంభించాడు. "దేవుడనేవాడు లేడురా అని ఎంత మొత్తుకున్నా ఎవడూ ఒప్పుకోడు. దేవుడు లేడనడానికి ఇంతకంటే చక్కని నిదర్శనం ఏంకావాలి? నిలువునా సొమ్మంతా దోచుకుపోతుంటే రాతిదేవుడు చూస్తూ ఊరుకున్నాడు. అదే మనిషైతే డొక్కచీల్చి వుండేవాడు."

"డొక్కచీరక పోయినా కనీసం దొంగవాడి పోలికలైనా చెప్పివుండేవాడు." అన్నాడుఅప్పుడే వచ్చిన నీలకంఠం. అపరాధ పరిశోధనా సాహిత్యాన్ని ఆ మూలాగ్రం చదివినవాడు నీలకంఠం. మనిషిని చూడగానే వాడు దొంగైనదీ కానిదీ— యిట్టే—ఐర్లండు కుక్కలా — పసికట్టెయ్యగల సమర్థుడు. యితనికి రాజగోపాల్ కు ఎప్పుడూ పడదు. యిద్దరూ ఏ విషయం గురించైనా వాదన ప్రారంభించారంటే యిక వదలరు.

" ఇక్కడ కూర్చుని వృథాగా కాలయాపన చేసేకంటే ఆలయంలోకివెళ్ళి పరిశోధన ప్రారంభించడం అవసరం." అన్నాడు నీలకంఠం.

"ఏం పరిశోధన చేస్తావ్? నీ ముఖం! వాడి దరిద్రం కొద్దీ దొంగతనం చేశాడు. పోయాడు. పోయింది దేవుడి సొమ్మేకదూ! దేవుడి సొమ్ము అంటే ప్రజల సమిష్టి ఆస్తి." అన్నాడు రాజగోపాల్.

"అయితే దొంగల్ని పట్టుకోకుండా వదిలెయ్యమంటావా? ఏదైనా జబ్బువస్తే మందువేసుకోవడం మానేస్తావా?" అన్నాడు కోపంతో నీలకంఠం.

"అసలు రోగం అనేది రాకుండా వుండేందుకు మేం మార్గం చూపిస్తున్నాం. మేం చెప్పిన ఆర్థిక సంస్కరణలు అమలులో పెట్టమను. దొంగ అనేవాడు మచ్చుకైనా కనిపిస్తాడేమో చూద్దాం." అన్నాడు రాజగోపాల్ తీవ్రంగా.

"దొంగతనం అన్నపదం అనాదినుంచి భారత సాహిత్యంలో పాతుకుపోయివుంది. హృదయాలను దొంగిలించినవాళ్లు, మనసును అపహరించిన

వాళ్ళు మన సాహిత్యంలో కొల్లలుగా కనిపిస్తారు. ఇంతటిస్థిరమైన పదాన్ని నిర్మూలింప చెయ్యడం అపచారం." అన్నాడు 'వక్రశ్రీ' ప్రవేశిస్తూ.

ఇతని అసలు పేరుచెప్పినా ఎవరికీ అర్థంకాదు. అందుచేత యితని కలంపేరు 'వక్రశ్రీ'నే మనం వాడుకోవడం మంచిది. యితనికి ప్రతివిషయాన్ని వక్రదృష్టితో చూడ్డం అలవాటు.

వివిధ రంగాలలో ప్రజ్ఞావంతులమైన మేం యిందరం వుండగా మా వీధిలోనే దొంగతనం జరగడం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మేం ఐదుగురం దొంగతనం జరిగిన చోటుకు బయలుదేరాం. మమ్మల్ని చూడగానే అక్కడ గుమిగూడి వున్న జనం అంతా మాకు దారియిచ్చారు. దొంగ గర్భగుడి తలుపులను మారుతాళంతో తెరిచాడు. తాళం కప్పక్రింద పడివుంది. సర్వాభరణాలతో కలకలలాడుతూ వుండే జగన్నాథస్వామి, భూషణ రహితుడై వెలవెల పోతున్నాడు.

"కలికాలం! దేవుడిసొమ్మే ఎత్తుకుపోయారు. ఇక మనం ఆగుతామా?" అన్నాడు గుంపులోని ఒక మనిషి.

"కలికాలం కాదు చలికాలం. వీధిలో ఎవరూ వుండరు కనక దొంగతనం జరిగింది." అని సవరించాడు రాజగోపాల్.

"ఒరేయ్! ఇక మీరంతా నిశ్శబ్దంగా వుండాలి ఒక క్షణమైనా వృధాచెయ్యడానికి వీల్లేదు. పోయిన సొత్తు కాస్తాకూస్తాకాదు. రెండువేల రూపాయలు!" అంటూ డిటెక్టివ్ పోజులో ముఖంపెట్టి సిగరెట్ వెలిగించి పరిశోధన కుపక్రమించాడు నీలకంఠం.

"ఏమయ్యాయి మహానుభావా! గర్భగుడిలో సిగరెట్ కాలుస్తున్నావ్!" ఎక్కడినుంచో అరుచుకుంటూ వచ్చాడుపూజారి.

"సమస్తప్రాణి కోటినీ సృష్టించిన దేవుడే పొగాకు మొక్కనుకూడా సృష్టించాడు. అటువంటప్పుడు దేవుడికి ప్రత్యేకించి పొగాకుమీద పక్షపాతం ఎందుకు?" ప్రశ్నించాడు వక్రశ్రీ.

"ఉష్! నిశ్శబ్దం!" సిగరెట్ గట్టిగాపీల్చి బయటపారేసి పరిశోధన ప్రారంభించాడు నీలకంఠం. యింతలో గుంపులోని తెలిసిన మనిషి నొకడినిపిలిచి పోలీసు స్టేషనుకు ఫోనుచెయ్యమని పంపించాను. అక్కడవున్న జనంఅంతా నీలకంఠం వైపు ఆత్రంగా చూస్తున్నారు.

నీలకంఠం తన జేబులోంచి అమెరికన్ స్కేలు ఒకటితీశాడు. నేలమీదకూర్చుని అడుగుల ముద్రలు కొలిచాడు. గదిపొడవు వెడల్పు కొలిచాడు. కొలతలను భద్రంగా నోట్ బుక్ లో రాసుకున్నాడు. నేలమీద ఒకసారి బోర్లగా పడుకున్నాడు. అక్కడ వున్నవాళ్ళంతా వాడు దేవుడికి సాష్టాంగ నమస్కారం చేస్తున్నాడనుకున్నారు. అదికూడా పరిశోధనలో ఒక అంశమని మాకు తెలును గనక మేం యేమీ అనుకోలేదు. గదిలో ఒకమూల వున్న నల్లని బొగ్గు గుండలాంటి పదార్థాన్ని జాగ్రత్తగా చేతులతో పోగుచేసి భూతఅద్దంతో పరిశీలించి చూశాడు. దాన్ని పొట్లంకట్టి జేబులో వేసుకున్నాడు. మరోమూల దొరికిన చిత్తుకాగితం ముక్కను జాగ్రత్తగా పరిశీలించి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు.

ఈ సమయంలో యిద్దరు పోలీసు జవాన్లు బూట్లు చప్పుడుచేసుకుంటూ నిద్రకళ్ళతో లోనికి వచ్చారు. వాళ్ళను చూడగానే నీలకంఠం చాలా సంతోషించి "మీరు సమయానికివచ్చారు. నేను చెప్పిన పద్ధతులతో మీరు దొంగల్ని వెతకడానికి ఉపక్రమించాలి" అన్నాడు.

"పోవయ్యా, మా నిద్రంతా పాడుచేశారు. ఏం పోయింది?" అన్నాడు చిరాగ్గా ఒక పోలీసు కానిస్టేబుల్.

"దేవుడిసొమ్ము సుమారు వెయ్యిరూపాయలు."

ఆ పోలీసు కానిస్టేబుల్సు యిద్దరూ ఒకసారి మా వీధిఅంతా పరిశీలించి ఒక అరుగుమీద పడుకుని నిద్రపోతున్న యిద్దరు మనుషుల్ని పట్టుకున్నారు.

"మేం దొంగలంకాదు బాబూ చింతపండు వర్తకులం!" అని వాళ్ళు గోల పెట్టారు.

మా వీధిలో వాళ్లుకూడా ఆ యిద్దరూ దొంగలు కాదని పోలీసులకు నచ్చచెప్పారు.

"మేం బయలుదేరిన తరవాత వృత్తిచేతులతో పోవడానికి వీల్లేదు సార్! దొంగ వాళ్ళను యిట్టే పోల్చేస్తాం. దొంగలు కాకపోతే ఉదయం వదిలేస్తాం" అని జవాబు చెప్పి పోలీసులు ఆ యిద్దరు మనుషుల్ని బలవంతంగా స్టేషనుకు తీసుకుపోయారు.

"యీ దేశంలో ప్రైవేటు డిటెక్టివులకువున్న కష్టం యిదేరా!" అన్నాడు నీలకంఠం నిరుత్సాహంగా.

"యిప్పటికి నీ పరిశోధననుబట్టి తేలిన విషయాలేమిటి?" అతనిని ఉత్సాహపరిచే ఉద్దేశంతో ప్రశ్నించాడు వక్రశ్రీ.

"దొంగ ఒకడుకాదు. ఇద్దరు దొంగలు ప్రవేశించారు. ఒక దొంగ పొడవు 5 అడుగుల 8 అంగుళాలు. మరో దొంగ పొడవు 5 అడుగుల 1 అంగుళం. అంటే ఒకడు పొడవు. ఒకడు పొట్టి" అన్నాడు నీలకంఠం.

"యీ కొలతలు నీకెలా తెలిసినై?" సందేహిస్తూ ప్రశ్నించాడు రాజగోపాల్.

"దొంగ వాడి రెండు అడుగులకు మధ్యవున్న దూరాన్ని కొలిచి చూస్తే వాడెంత పొడవున్నదీ సులువుగా తెలుసుకోవచ్చు" అన్నాడు నీలకంఠం.

నీలకంఠం తిరిగి తన పరిశోధనను విప్పి చెప్పడము ప్రారంభించాడు. "ఆ యిద్దరు దొంగలలో పొడువుపాటివా డొక్కడూ గర్భ గుడి లోకి వెళ్ళాడు. పొట్టివాడు బయట కాపలావున్నాడు. పొట్టి దొంగకు గుర్రంమార్కు బీడీ కాల్చే అలవాటు వుంది."

"వాడు బీడీ కాలుస్తాడో గంజాలు కాలుస్తాడో నువ్వెలా చెప్పగలవు?" ప్రశ్నించాడు రాజగోపాల్.

నీలకంఠం తన జేబులోంచి చిన్న కాగితం పొట్లంతీసి "యీ రంగు మసి గుర్రంమార్కు బీడీకి మినహా యిక దేనికీ వుండదు. ఈ విషయంలో నేనిదివరకు చాలా పరిశోధనలు చేశాను."

"పొడవువాడు ముందు నడిచాడు. పొట్టివాడు వెనక నడిచాడు. ఇద్దరూ ఉత్తర దిశవైపు పోయారు."

యింతవరకూ నీలకంఠం కథనాన్ని జాగ్రత్తగా వింటూన్న ఒక పెద్దమనిషి "యీాయన చెప్పినది చాలావరకూ నిజం" అన్నాడు.

"మీకు దొంగతనంగురించి ఏమైనా వివరాలు తెలుసా?" ప్రశ్నించాడు ప్రకాశరావు.

ఆ పెద్దమనిషి తను చూచిన విషయాలను చెప్పడం ప్రారంభించాడు. "ఈ దేవాలయానికి తిన్నగావున్న ఆ యిల్లే మాది. అర్థరాత్రి వేళ దేవాలయం తలుపులు తెరుస్తున్న చప్పుడు వినిపిస్తే నేను కిటికీలోంచి చూశాను. పొడవుగావున్న మనిషి లోనికిపోయాడు. పొట్టివాడు బయట వున్నాడు. తరవాత తలుపులు అలా వదిలి ఇద్దరూ వెళ్ళిపోయారు. పొట్టివాణ్ణి మాత్రం నేను ఆనవాలు పట్టాను. వాడు మన పూజారిగారి పాలేరు."

"ఐతే యీ దొంగతనంలో మరొక ఘరానా మనిషికికూడా పాలుంది" అన్నాడు నీలకంఠం.

"ముందు ఆ పాలేరువాణ్ణి పిలకపట్టుకు జాడిస్తే అసలు విషయం చెపుతాడు. ముందు వాణ్ణి లాక్కురావాలి" అన్నాడు ప్రకాశరావు.

వెంటనే నలుగురు మనుషులు వెళ్ళి పాలేరును లాక్కువచ్చారు.

"ఒరేయ్! దొంగతనం ఎవరు చేశారురా?" కళ్ళెర్రచేసి అడిగాడు ప్రకాశరావు.

"ఏమో బాబూ!" అన్నాడు వాడు జడుస్తూ. తక్షణం ప్రకాశరావు వాడిని రెండుచేతులతోనూ ఆకాశంలోకి ఎత్తి "ఇక్కడినుంచి క్రిందపారెయ్యమంటావా? నిజం చెబుతావా?" గద్దించి అడిగాడు.

"నిజం చెపుతాను బాబోయ్" అన్నాడు వాడు. వాణ్ణి క్రిందికి దింపాడు ప్రకాశరావు.

"నేనే సొమ్మెత్తుకుపోయాను బాబూ!" అన్నాడు వాడు ఏడుస్తూ.

"అబద్ధం చెప్పకురా. నువ్వు ఎత్తుకుపోలేదు. సొమ్ము పట్టుకుపోయినవాడు వేరేవున్నాడు. నువ్వు కాపలావున్నావంతే" అన్నాడు నీలకంఠం.

"బాబూ! నా నోటిదగ్గర కూడు ఎందుకు పడగొడతారు? నాకు నాలుగునెలలు జెయిలేస్తే చేసొస్తాను. ఇంక నన్నేమీ అడక్కండి బాబూ! మీకాళ్ళకి దణ్ణం పెడతాను. దొంగతనం నేనే చేశాను" అన్నాడు పాలేరు ఏడుస్తూ.

వాణ్ణి ఎంత బెదిరించినా అసలు దొంగ ఎవరో చెప్పలేదు. ఇక మేం వాణ్ణి హింసించేకంటే పోలీసు స్టేషనుకు పంపించడం మంచిదనుకున్నాం. అసలు దొంగలు దొరికారు వెంటనే రమ్మని పోలీసు స్టేషనుకు ఫోను చేశాం.

పోలీసు స్టేషనునుంచి మాకే జవాబు వచ్చింది.

"మేం పట్టుకున్న దొంగలు నేరం ఒప్పుకున్నారు. ఇక మీరు వృథాగా శ్రమపడవలసిన అవసరంలేదు."

★